సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



పక్కాగా పంచాయతీ పాలన

గ్రామ పంచాయతీల పాలనా వ్యవహారాల్లో పారదర్శకత కోసం, ప్రజలు సులభంగా అన్ని విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకొచ్చింది.

II లో



సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యతోపాటు సంప్రదాయాలపై అవగాహనను పెంచుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు యువతకు సూచించారు.

II లో

సముద్రంలోకి 4.76 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 4,76,663 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కులు వదిలారు. భద్రాచలం వద్ద 27.20, కాటన్ బ్యారేజీ వద్ద 10.30 అడుగులకు నీటిమట్టం చేరింది.

పరిమళించిన మానవత్వం

- ప్రజా విజ్ఞప్తులపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- నిడదవోలు సభలో అర్జీలపై తక్షణ స్పందన
- స్వల్ప వ్యవధిలోనే ఆర్థిక సాయం అందజేత
- సీఎం ఔదార్యంతో బాధితుల ఆనందం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

సాక్షి, రాజమహేంద్రవరం: మానవత్వం పరిమళించింది. ప్రజా విజ్ఞప్తులపై తక్షణం స్పందించింది. అవస్థల నుంచి సాంత్వన చేకూర్చింది. ప్రభుత్వం అండగా ఉందన్న భరోసా కల్పించింది. వినతులు ఇచ్చిన రోజుల వ్యవధిలోనే వాటి పరిష్కారం లభించింది. వెరసి బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న నిడదవోలులో పర్యటించారు. ఈ సందర్భంగా హెలిపాడ్ వద్ద వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ క్రమంలో 23 మంది బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్న సీఎం వాటిని తక్షణం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించింది. వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేసింది. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.31 లక్షలు అందజేశారు. తమ సమస్య అనతి కాలంలోనే తీరడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వినతులు పరిశీలిస్తే..

- కొవ్వూరు మండలానికి చెందిన ఎం.జస్వాని సాయి అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. యూరిన్ బ్లాడర్‌కు శస్త్రచికిత్స చేయించారు. అందుకుగాను రూ.1.లక్ష సాయం మంజూరైంది. ఆ చెక్కును కలెక్టర్ కె.మాధవీలత బాధితురాలు, కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.
- చాగల్లు మండలానికి చెందని సిర్రా సునీత మానసిక, శారీరక దివ్యాంగురాలు. ఆమెకు మందుల కోసం సీఎం జగన్ రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఆమెకు కలెక్టర్ చెక్కు అందజేశారు.
- చాగల్లు మండలం నందిగంపాడు గ్రామానికి చెందిన నందిగం వర్షిణి వినికిడి సమస్యతో బాధపడుతోంది. ఆమెకు వినికిడి యంత్ర పరికరాలు అందచేయాలని ఆదేశించి, తక్షణ వైద్య ఖర్చుల కోసం రూ.1 లక్ష చెక్కు పంపిణీ చేశారు.
- చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన యార్లగడ్డ సుశీలకు ఎముకల సమస్య చికిత్సకు రూ.1.లక్ష అందజేశారు.
- చాగల్లు గ్రామానికి చెందిన గూడూరి వేదశ్రీ లక్ష్మీ రమ్యశ్రీ, చెవిటి, మూగ, అంగవైకల్యం బాధితురాలికి వైద్య సహాయం కోసం రూ.లక్ష అందజేశారు. అంతేగాక పింఛను మంజూరు చేయనున్నారు.
- చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన కాజా నిఖిల శ్రావణి, కాజా సుప్రజలకు కంటి సంబంధిత సమస్యకు శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉంది. అందుకు ఒక్కొక్కరికి రూ.50,000 చొప్పున ఇద్దరికీ కలిపి రూ.1 లక్ష అందజేశారు.
- నిడదవోలుకు చెందిన ముప్పనబోయిన కుశాంత్ అంధుడు. శస్త్రచికిత్స ఖర్చులకు రూ. లక్ష ఇచ్చారు.
- నిడదవోలు మండలం కలవచర్లకు చెందిన చదలవాడ విహాస్ కాళ్ల అలైన్‌మెంట్ వైద్య ఖర్చులకు రూ.1. లక్ష అందజేశారు.
- నిడదవోలు మండలం శెట్టిపేటకు చెందిన మెరిపో లక్ష్మి చేతులకు లోపంతో పుట్టారు. ప్రత్యేక పింఛను మంజూరుకు సీఎం హామీ ఇచ్చారు. తక్షణ ఆర్థిక సాయంగా రూ. లక్ష మంజూరు చేశారు.
- సాకా ఉమ(ఇందిరానగర్, నిడదవోలు) బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష, ఇంటి స్థలం మంజూరు చేశారు.
- వీరమల్ల సతీష్ కుమార్ (దోతీ కాలనీ, నిడదవోలు) కంటి సమస్య వైద్య ఖర్చులకు రూ. లక్ష సాయం చేశారు. నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం కల్పించాలని సీఎం ఆదేశించారు.
- బుద్దన లక్ష్మి పోశమ్మ(పెరవలి, నిడదవోలు మండలం) సిస్టమిక్ డిసీజ్‌కు వైద్య సహాయంగా రూ. లక్ష అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా పూర్తి ఖర్చు చెల్లించేందుకు హామీ. రూ.3 వేల పింఛను పథకం వర్తింపు.
- పడిలం జీవన్ జ్యోతి (చెరువు ప్రకాశరావు పాలెం, నల్లజర్ల మండలం) పోక్సో కేసు కింద ఆర్థిక సాయంగా రూ. లక్ష చెక్కు పంపిణీ.
- డేగల సురేష్ కుమార్ (రాజానగరం) థైరాయిడ్ కారణంగా కంటి సమస్య ఎదురైంది. శస్త్రచికిత్సకు రూ. లక్ష పంపిణీ
- దువ్వారపు షర్మిల (ధవళేశ్వరం, రాజమహేంద్రవరం - రూరల్) దివ్యాంగుడు ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స, మందుల కోసం రూ. 1 లక్ష, వైఎస్సార్ నవశకం ఆరోగ్య పెన్షన్ రూ.5 వేలు, ఇంటి స్థలం మంజూరు.
- గణపవరపు గోపాలకృష్ణ(అమలాపురం) కాలేయ సంక్రమణ నివారణ వైద్య ఖర్చులకు రూ.1 లక్ష అందజేత.
- సవరపు శరణ్ గ్రేస్ (ఉప్పలగుప్పం, అమలాపురం మండలం) మెదడు వ్యాధి వాపు చికిత్సకు రూ.1 లక్ష రూపాయల చెక్కు పంపిణీ చేశారు.

పోలుమటి అభినయ్ (ముదుకూర్రు దేవరపల్లి మండలం) గ్లూటారిక్ అసిడ్యూరియా టైప్-1 (జీఏ-1) వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం వారి తల్లికి రూ.5 లక్షల రూపాయల చెక్కు అందజేశారు. ఇల్లు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు.

చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన కాకుల పాటి మేతు షాల్ పుట్టుకతో అంధుడు. కంటి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. స్పందించిన సీఎం రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. కలెక్టర్ చెక్కును బాధితుడికి అందజేశారు. తగిన శస్త్ర చికిత్స చేసేందుకు పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు ఆదేశించారు.

నందిగం స్వామినాథ్ (ఉప్పలగుప్పం, అమలాపురం మండలం) లివర్ ఇన్ఫెక్షన్ తో మూడేళ్లుగా హిపటైటిస్-బీతో బాధపడుతున్నాడు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు.

మట్టా దుర్గ (అయినవిల్లి, పి.గన్నవరం మండలం, ఒంటరి మహిళ. గుండె వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం రూ. లక్ష చెక్కు అందజేశారు.



పంతుల తజిత, పంతుల ఎల్లయ్య (త్యాజంపూడి గ్రామం, దేవరపల్లి మండలం) ఇద్దరు పిల్లల ఎదుగుదల నిమిత్తం ఆర్థిక సాయంగా రూ. లక్ష, ఇద్దరు పిల్లలకు నెలకు రూ.5 వేల చొప్పున పింఛను, మొత్తం వైద్య ఖర్చులు భరించేలా అధికారులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు.

పేద రోగికి ఢిల్లీలో వైద్యం



సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును రోగి కుటుంబీకులకు అందిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: మండలంలోని పిట్టల వేమవరానికి చెందిన మల్లుల కిశోర్‌కు ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. కొద్ది కాలానికే అతడికి పెరాలసిస్ రావడంతో అవయవాలేవీ పనిచేయడం మానేశాయి. దాంతో కిశోర్ మంచానికే పరిమితం అయ్యాడు. భారీ మొత్తంలో ఖర్చు చేసి వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేని కుటుంబీకులు ఆశలు వదిలేసుకున్నారు. ఇలాంటి తరుణంలో కొన్నాళ్ల క్రితం పిట్టల వేమవరం వచ్చిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్నారు. స్వయంగా కిశోర్ ఇంటికి వెళ్లి, అతడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నాక, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా వైద్యం అందించే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వెంటనే వైద్య సహాయం కోరుతూ అవసరమైన పత్రాలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించే ఏర్పాటు చేశారు. హామీ ఇచ్చినట్టుగానే ఈ నెల 16న నిడదవోలు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే రోగి కిశోర్‌ను పరిచయం చేసి, అతడి వ్యాధి గురించి వివరించి, వైద్యానికి సాయం చేయాల్సిందిగా కోరారు. ఎంత ఖర్చయినా ఆలోచించకుండా కిశోర్ వైద్యానికి చర్యలు తీసుకోవాలని పెద్ద మనసుతో ముఖ్యమంత్రి జగన్ వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. కిశోర్‌కు అవసరమైన వైద్యం దేశంలో కేవలం ఢిల్లీలో మాత్రమే లభిస్తోందని తెలిసినప్పటికీ కూడా వెనుకాడకుండా ప్రభుత్వం వైద్యం చేయించటానికి అన్ని చర్యలూ తీసుకుంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన ప్రాసెస్ జరుగుతోంది. ఈ లోగా రోగి కిశోర్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాధారణ వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఆ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు బుధవారం పెరవలిలో రోగి కుటుంబీకులకు అందించారు. దాంతో కిశోర్ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. ఖరీదైన వైద్యం చేయించలేని తాము తమ బిడ్డ ప్రాణాలపై ఆశలు వదిలేసుకున్నామన్నారు. కానీ ముఖ్యమంత్రి దయ వలన ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు కృషితో తన బిడ్డ ప్రాణాలు దక్కుతాయన్న ఆశ కలిగిందని ఆనందంగా చెప్పారు.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్



మాధవీలత, కలెక్టర్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. అలాగే ఆ రోజు జరగాల్సిన రాజానగరం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడిందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియజేస్తామన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా సుందరాచారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి నియమితులయ్యారు. ఈ మేరకు హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గుంటూరు జిల్లాలోని మెడికల్ కళాశాలలో న్యూరాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన రమేష్ ఉద్యోగ విరమణ చేయడంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సూర్యప్రభ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు సుందరాచారి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు.

నేడు సీటీఆర్‌ఐలో వర్క్‌షాప్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్‌ఐ)లో గురువారం 26వ అఖిల భారత పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్టు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సీటీఆర్‌ఐ డైరెక్టర్, ఏఐఎన్‌పీటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్‌నకు గౌరవ అతిథులుగా న్యూఢిల్లీ ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్స్) టీఆర్ శర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సీడ్స్) డాక్టర్ కెయాదవ్ పాల్గొంటారన్నారు. పొగాకు పరిశోధనలలో నిష్ణాతులు డాటిజికె మూర్తి, డా.యు.శ్రీధర్, డా.సి.చంద్రశేఖరరావు సాంకేతిక తరగతులకు అధ్యక్షత వహిస్తారన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు భార్య దీప్తికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా హోంగార్డు యూనిట్ తమ ఒక్కరోజు జీతం రూ.1,58,330ను తోటి హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎస్పీ పి.జగదీష్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు కుటుంబ సభ్యులకు అందజేశారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ హోంగార్డు కుడిపూడి వెంకట శ్రీనివాసరావు గత నెలలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య దీప్తికి ఈ చెక్కు అందజేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డులు ఎవ్వరైనా మరణిస్తే హోంగార్డు యూనిట్ తరఫున ఇలా స్వచ్ఛందంగా సాయం అందజేస్తున్నారు. ఈ మేరకు జిల్లా యూనిట్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.భాస్కరరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధికి నైపుణ్యాభివృద్ధి తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అసంఘటిత కార్మికులు, ఖైదీల జీవనోపాధికి నైపుణ్యాభివృద్ధి తరగతులు నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో రెవెన్యూ శాఖలోని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ ముఖ్య ప్రణాళికా అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, ఖైదీల జీవనోపాధికి పోర్టు, భవన నిర్మాణ, వడ్రంగి, రొట్టెల తయారీ, వ్యవసాయం, టైలరింగ్ వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్మిక సంక్షేమ శాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమన్వయంతో వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతల సహకారంతో దీనిని అమలు చేయాలన్నారు. వీటి నిర్వహణలో ఎలాంటి సందేహాలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు.

అక్టోబర్ 21న స్పెషల్ లోక్ అదాలత్

వచ్చే నెల 21న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత వివాదాలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల యాక్సిడెంటు కేసులు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పరిష్కరింపబడతాయన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు

నేడు మారథాన్ రన్



రాజమహేంద్రవరం రూరల్: ఎయిడ్స్ నియంత్రణ, నివారణ, యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం కోసం గురువారం ఉదయం 7 గంటలకు స్థానిక వై.జంక్షన్ నుంచి ఇస్కాన్ టెంపుల్ వరకు మారథాన్ 5 కె రన్ నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఎం) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బొమ్మూరులోని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయంలో జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ అంశంపై డాక్టర్ ఎన్.వసుంధర అధ్యక్షతన బుధవారం యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మారథాన్ 5 కె రన్ (రెడ్ రన్), డ్రామా, రీల్ మేకింగ్, క్విజ్ పోటీలను డిగ్రీ కాలేజీ విద్యార్థులకు (17-25 ఏళ్ల యువత) నిర్వహించి, ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మారథాన్ రన్‌లో మొదట బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, మరో ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.1000 చొప్పున అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమన్ని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు.

56 పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదన

- కొత్తగా 8 కేంద్రాల ఏర్పాటు
- వెల్లడించిన కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జేసీ తేజ్ భరత్

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలోని 56 చోట్ల పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు పంపనున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధతపై రాజకీయ పార్టీలతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నియోజక వర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఆరు అంశాల ప్రాతిపదికన సమీక్షించామన్నారు. నియోజక వర్గాల వారీగా ప్రస్తుత పరిస్థితిపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించి, ఈఆర్‌వోలు సమగ్ర అధ్యయనం చేసిన అనంతరం వివరాలు అందజేసినట్లు తెలిపారు. కొవ్వూరు పరిధిలో 5, రాజానగరంలో 15, రాజమండ్రి రూరల్‌లో 10, గోపాలపురంలో 9, నిడదవోలులో 6, అనపర్తిలో 8, రాజమండ్రి సిటీ పరిధిలో 3 వెరసి మొత్తం 56 పోలింగ్ కేంద్రాల మార్పుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1,559 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా ఎనిమిది కేంద్రాలను ప్రతిపాదించామని, ఆ మేరకు పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,567కి చేరనుందన్నారు. కొత్తవాటిలో రాజమండ్రి సిటీలో 7, రాజమండ్రి రూరల్‌లో ఒకటి ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు, నియోజక వర్గ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని చెంత.. ఇక విశ్రాంతికి లేదు చింత

- 30 వీఐపీ సత్రం స్థలంలో రూ.1.99 కోట్లతో షెడ్డు ఏర్పాటు
- నిర్మించనున్న సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ లాబ్స్



30 వీఐపీ సత్రాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అన్నవరం: రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద అన్ని వసతులతో విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. సత్యదేవుని దేవస్థానానికి పర్వదినాల్లో వచ్చే భక్తులకు వసతి గదులు లభ్యం కాక, వేచి ఉండేందుకు పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా మరో రెండు నెలల్లో భక్తుల ఇక్కట్లు తీరనున్నాయి. పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం స్థలంలో రూ.1.99 కోట్లతో భక్తుల సౌకర్యార్థం విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మాసూటికల్స్ కంపెనీ లారల్ లాబ్స్ ఈ విశ్రాంతి షెడ్డును నిర్మించనుంది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు అంగీకారం తెలియజేసినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. 30 వీఐపీ సత్రం కూల్చి వేస్తే సుమారు ఎకరం స్థలం ఖాళీ ఏర్పడుతుంది. ఆ ఖాళీ స్థలంలో 180 అడుగుల పొడవు 150 అడుగుల వెడల్పుతో సుమారు 18 అడుగుల ఎత్తులో విశ్రాంతి షెడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ షెడ్డులో ముందు భాగంలో ప్రసాదం కౌంటర్, వ్రతాలు, ప్రదక్షిణ దర్శనం టికెట్ కౌంటర్, పూజాద్రవ్యాల షాపు, ఫ్యాన్సీ షాపు ఏర్పాటు చేస్తారు. షెడ్డులో మరో వైపు మినీ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ షెడ్డు వెనుక వైపున భక్తుల కోసం టాయిలెట్స్ ఏర్పాటు చేయనున్నారు.

జోరుగా సత్రాల కూల్చివేత పనులు

పశ్చిమ రాజగోపురం ముందు గల 30 వీఐపీ సత్రం, మెయిన్ క్యాంటీన్ ముందు గల పీజీహెచ్ గెస్ట్‌హౌస్ కూల్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి. పీజీహెచ్ గెస్ట్‌హౌస్ ఇప్పటికే సగానికి పైగా కూల్చేశారు. ఈ నెల 26 నాటికి ఈ రెండు సత్రాలు కూల్చి వేయాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. ఈ స్థలంలో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి లారెల్స్ లాబ్ ప్రతినిధులు ఇచ్చిన అంగీకారపత్రం ఈఓ ఆదేశాల మేరకు కమిషనర్ కార్యాలయానికి పంపించినట్లు ఈఈ నర్సింహారెడ్డి తెలిపారు.

పక్కాగా పంచాయతీ పాలన

- ఈ–గ్రామ్ స్వరాజ్‌తో అవకతవకలకు చెక్
- వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు
- చేపట్టిన పనులు, నిధుల ఖర్చు ఆన్‌లైన్
- పారదర్శకంగా ఆడిట్ నిర్వహణ



రాయవరం: గ్రామ పంచాయతీల పాలనా వ్యవహారాల్లో పారదర్శకత కోసం, ప్రజలు సులభంగా అన్ని విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకొచ్చింది. 2020లోనే ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇటీవల యాప్‌ను మరింతగా అభివృద్ధి చేశారు.

ఎందుకింత ప్రాధాన్యమంటే..

చాలా చోట్ల పంచాయతీ పాలకవర్గాలు చేస్తున్న నిధుల ఖర్చు తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకుంటున్నారు. ఆ చట్టం మంచిదే అయినా అడిగిన సమాచారం తీసుకోవడానికి కొంత సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో అరచేతిలో క్షణంలో ఏ గ్రామ పంచాయతీ వివరాలు కావాలనుకుంటే అవి, నిధులు, వ్యయ వివరాలు సులభంగా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌నకు రూపకల్పన చేసింది. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కోసం జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్ర ఆర్థిక సంస్థ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. వీటికితోడు పంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా కొంత నిధి జమ అవుతూ ఉంటుంది. ఈ నిధులను 25 శాతం పారిశుధ్య నిర్వహణకు, 25 శాతం తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లుల చెల్లింపులకు, 50 శాతం పంచాయతీల నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులకు వినియోగించాలి. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయడం లేదు. పలు పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయి. పంచాయతీల నిర్వహణపై పారదర్శకత కోసం ఈ యాప్‌ను ప్రవేశ పెట్టారు. యాప్‌తో అవకతవకలకు చెక్ పడే అవకాశం ఉండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

385 పంచాయతీల్లో అమలు

కోనసీమ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల్లోనూ ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్ అమల్లోకి వచ్చింది. ఈ పంచాయతీలకు వస్తున్న నిధులు, చేస్తున్న వ్యయం, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు సంబంధిత కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆడిట్ నిర్వహణ కూడా సక్రమంగా జరగడానికి అవకాశమేర్పడింది. గతంలో పంచాయతీల్లో నిర్వహించే ఆడిటింగ్‌లో ఆడిటర్లు పలు అభ్యంతరాలను వ్యక్తం చేసేవారు. ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్ వచ్చిన తర్వాత గతంలో మాదిరిగా అవకతవకలు, అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు.

నిధుల వినియోగంలో జవాబుదారీతనం



పంచాయతీల్లో ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్ ద్వారా పంచాయతీ లావాదేవీలు అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్‌లో నిధుల నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలను కార్యదర్శులు నమోదు చేస్తున్నారు. ఈ యాప్ ద్వారా నిధుల వినియోగంలో జవాబుదారీతనం పెరుగుతుంది.

– వి.కృష్ణకుమారి, జిల్లా పంచాయతీ అధికారి

మూడేళ్ల నుంచి..

పంచాయతీల్లో పాలన పారదర్శకంగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం 2020 ఏప్రిల్ 24న ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకుని వచ్చింది. పంచాయతీలకు ఇస్తున్న నిధుల వ్యయంపై జవాబుతారీతనాన్ని పెంచేందుకు ఈ యాప్ ఉపకరిస్తుంది. ఈ యాప్‌లో పంచాయతీలకు వివిధ పద్దుల ద్వారా వస్తున్న నిధులు ఎన్ని? వాటితో ఏఏ పనులు చేయాలి, సిబ్బంది జీతభత్యాల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణ ఖర్చులు, ఏ పనికి ఎంత ఖర్చు చేశారు, పాలకవర్గాల సమాచారం తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని గ్రామ పంచాయతీల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ–గ్రామ్ స్వరాజ్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ పేరును క్లిక్ చేయగానే వివరాలన్నీ కనిపిస్తాయి. ఈ యాప్ వచ్చినప్పటి నుంచి పంచాయతీ పాలకవర్గాలు, కార్యదర్శులు నిధుల నిర్వహణను సమర్థవంతంగా చేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

ఆల్ ఇండియా బాడ్మింటన్‌లో అభిషేక్‌కు 3వ స్థానం



రామచంద్రపురం: ఈ నెల 14 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జ్వాలా గుత్తా అకాడమీ అఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జరిగిన యోనెక్స్ –సన్ రైజ్ 35వ సబ్ జూనియర్ నేషనల్ బాడ్మింటన్ అండర్ –15 డబుల్స్ చాంపియన్‌షిప్ –2023లో మోడరన్ హైస్కూల్ విద్యార్థి బోను అభిషేక్ నేషనల్ లెవెల్‌లో 3వ స్థానం సాధించి సత్తా చాటుకున్నాడని మోడరన్ అధినేత జి.వి.రావు బుధవారం విలేకరులకు తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి అభినందనలు తెలియజేశారు.

25న ఏపీ ఆర్ఆర్ఈఏ రాష్ట్ర స్థాయి ఎన్నికలు



ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న పద్మనాభం తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ రాష్ట్ర కమిటీ ఎన్నికలు కాకినాడ సూర్యకళా మందిరంలో ఈ నెల 25న జరుగుతాయని జిల్లా శాఖ అధ్యక్షుడు కె.పద్మనాభం తెలిపారు. బుధవారం కాకినాడలోని విశ్రాంత ఉద్యోగల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. పద్మనాభం మాట్లాడుతూ రాష్ట్ర సంఘానికి ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు తదితర 36 పోస్టుల భర్తీకి ఓటు హక్కు కలిగిన 25 జిల్లా యూనిట్స్ నుంచి అధ్యక్ష, కార్యదర్శులు మొత్తం 339 మంది ఎన్నుకుంటారన్నారు. ఈ నెల 24న నామినేషన్ల స్వీకరణ, 25న పోలింగ్ ఉంటుందని తెలిపారు. కాకినాడ జిల్లా యూనిట్ నుంచి కార్యదర్శి పీఎస్ఎన్వి శాస్త్రిని రాష్ట్ర సంఘ అధ్యక్ష పదవికి బలపరచామన్నారు. ఎన్నికల అధికారిగా ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు ఆచంట రామారాయుడు వ్యవహరిస్తున్నారన్నారు. కోశాధికారి ఎస్.ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోండి



చొల్లంగిలో బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ సాయి మనోహర్

తాళ్లరేవు: దేశంలోనే నాలుగో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ కె.సాయి మనోహర్ కోరారు. బుధవారం జాతీయ రహదారి 216 సమీపంలో చొల్లంగిలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ శాఖా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించడంలో తమ బ్యాంకు ముందుంటుందని, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో శాఖా కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలతో పాటు వ్యవసాయ, డ్వాక్రా, బంగారు రుణాలతో పాటు ఆక్వా, డెయిరీ, పౌల్ట్రీకి సంబంధించిన రుణాలకు కూడా అందజేస్తామన్నారు. వినియోగదారులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించడం ద్వారా మరింత ఆర్థిక ప్రయోజనాన్ని పొందవచ్చని, బ్రాంచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాళ్లరేవు బ్యాంకు పరిధిలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు చెందిన అకౌంట్లను ఇక్కడకు బదిలీ చేసుకునే అవకాశం కల్పించాలని డ్వాక్రా మహిళలు కోరగా దానికి ఆయన అంగీకరించారు. తొలుత సాయి మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయం, మేనేజర్ చాంబర్, స్ట్రాంగ్‌రూమ్, క్యాషియర్ రూములను ప్రారంభించారు. డిప్యూటీ రీజనల్ హెడ్ డీవీ రంగారావు, చొల్లంగి బ్రాంచి మేనేజర్ పీకే పోసిబాబు, హెడ్ క్యాషియర్ జె.గణేష్ పాల్గొన్నారు.

కాలువ రేవులో యువకుడి గల్లంతు

రెండు రోజులుగా లభించని ఆచూకీ



మోహనరావు (ఫైల్)

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంక కాలువ రేవులో రవ్వల మోహనరావు అనే 30 ఏళ్ల యువకుడు ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం కాలువ రేవులోకి వెళ్లిన మోహనరావు కాలుజారి కాలువలోకి పడిపోయాడు. ఆ తరువాత కన్పించలేదు. దీంతో స్థానికులు అతని కోసం రెండు రోజులుగా వెతుకుతున్నారు. బుధవారం సాయంత్రానికి కూడా ఆచూకీ లభించలేదు. కాలువలో నీటి మట్టం అధికంగా ఉండడం వల్ల గాలించడం కష్టమవుతోందని యువకుడి తండ్రి సంపదరావు చెబుతున్నారు. మోహనరావు మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సరీ పనుల నిమిత్తం మోహనరావు, కుటుంబ సభ్యులు శ్రీకాకుళం ప్రాంతం నుంచి ఇక్కడకు వలస వచ్చారు. మోహనరావు గల్లంతైన నేపథ్యంలో అతని కుటుంబ సభ్యులు, బంధువులు కాలువ రేవులోనే అతని ఆచూకీ కోసం నిరీక్షిస్తున్నారు.



బుర్రిలంక కాలువ రేవులో నిరీక్షిస్తున్న మోహనరావు కుటుంబ సభ్యులు, బంధువులు

వృద్ధ దంపతులపై చైన్ స్నాచర్ల దాడి

రూ. 1.20 లక్షల బంగారు మంగళ సూత్రం చోరీ

రాజోలు: వృద్ధ దంపతులపై చైన్ స్నాచర్లు దాడి చేసి రూ.1.20 లక్షల విలువ చేసే బంగారు మంగళసూత్రం చోరీ చేసిన వైనమిది. మలికిపురం మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన నార్ని వెంకటరత్నం అనారోగ్యంతో ఉన్న తన భార్య కనకదుర్గను మంగళవారం రాత్రి రాజోలు ఆస్పత్రికి మోటార్ సైకిల్‌పై తీసుకువెళ్లారు. వైద్యం చేయించి ఇంటికి తిరిగి వెళుతుండగా కూనవరంలో చైన్ స్నాచర్స్ దాడి చేశారు. మోటార్ సైకిల్‌పై కూర్చుని ఉన్న కనకదుర్గ మెడలో ఉన్న రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కాసుల బంగారు మంగళ సూత్రాల తాడును బలవంతంగా లాక్కుని చైన్ స్నాచర్స్ పారిపోయారు. ఈ హఠాత్పరిణామంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వృద్ధులు కింద పడిపోగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధ దంపతుల నుంచి రాజోలు పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పృథ్వీ తెలిపారు.

రిమాండ్ ఖైదీ మృతి



మృతి చెందిన వీర వెంకట సత్యనారాయణ

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఓ రిమాండ్ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీర వెంకట సత్యనారాయణ(19) ఓ దొంగతనం కేసులో ఈ నెల 6వ తేదీ నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అతడికి టైఫాయిడ్ సోకింది. ఎస్కార్ట్ సిబ్బంది అతడిని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చేసిన పరీక్షల్లో డెంగీ సోకిందని తేలింది. ప్లేట్ లెట్లు పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం సత్యనారాయణను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

రౌడీషీటర్ హత్య కేసులో మరో ఇద్దరి అరెస్ట్

- ఇప్పటి వరకూ 13 మంది నిందితుల అరెస్ట్
- డీఎస్పీ అంబికా ప్రసాద్ వెల్లడి

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో ఇటీవల జరిగిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. అంబాజీపేటకు చెందిన సిరిపెల్ల శ్రీ వీర వెంకట దుర్గాప్రసాద్, అమలాపురం కొంకాపల్లికి చెందిన నార్ని ఫణి కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరినుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈదరపల్లి శ్మశానంలో రౌడీ గ్యాంగ్ అదే గ్రామానికి చెందిన రౌడీ షీటర్ కిషోర్‌ను హత్య చేయడంతో పాటు అతని స్నేహితుడు అడపా సాయిపై హత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఈ హత్య, హత్యాయత్నం కేసులో ఇప్పటి వరకూ 11 మందిని అరెస్ట్ చేయగా తాజాగా మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. మరికొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని డీఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాలతో పట్టణ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు, ప్రత్యేక పోలీసు బృందాలు కేసును దర్యాప్తు చేస్తున్నాయని చెప్పా రు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలి



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



జానపద నృత్యం (గ్రూప్) లో ప్రథమ స్థానం అందుకున్న భావయామి గ్రూప్

'నన్నయ'లో ఘనంగా యువజనోత్సవాలు

రాజానగరం: విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, కళాత్మక దృష్టితో సంప్రదాయాలపై అవగాహనన పెంచుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు యువతకు సూచించారు. స్వామి వివేకానందుని సేవలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో యువత భాగస్వామి కావాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాలలో భాగంగా జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ (కాకినాడ) ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన యువజనోత్సవాలు ఆహ్లాదకర వాతావరణంలో ఉల్లాస భరితంగా సాగాయి. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజభరత్ జ్యోతి వెలిగించి ఈ ఉత్సవాలు ప్రారంభించారు. జేసీ ప్రారంభోపన్యాసం ఇస్తూ యువతలో ప్రతిభను వెలికితీసి, ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సులో ఉన్న యువత సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం,జనపద గేయాలు, స్టోరీ రైటింగ్, పోస్టర్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, పర్యావరణ పరిరక్షణ వంటి వాటిలో పోటీ పడ్డారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సెట్రాజ్ సీఈఓ కె. శ్రీరమణి, మేనేజర్ కెఎస్‌వి కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, సూపరింటెండెంట్ సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్‌రాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

విజేతలు వీరే

జానపద నృత్యం (గ్రూప్)లో విజయ, లాస్య, శ్రీవల్లీ, అభినయ, లీలాశ్రీ, యామినితో కూడిన భావయామి ఇనిస్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రథమ స్థానం అందుకున్నారు. అకాడమీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ చక్రవర్తుల పవన్‌కుమార్ వీరిని అభినందించారు. జె.అఖిల గ్రూప్‌కి ద్వితీయ స్థానం, శ్రీయాత గ్రూప్‌కి తృతీయ స్థానం లభించాయి. సోలోలో బడుగు దీపిక, కేవీఎస్ వర్షిక, పడిశెట్టి డోలసరస్వతి మొదటి మూడు స్థానాలను అందుకున్నారు. జానపద గేయాలులో నానాకుమారి గ్రూప్, రఘు అండ్ టీమ్, వి.రామోజీదీపిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. సోలోలో రాగా సుధ, చిలకపాటి సువర్ణ, యాగి చక్రవర్తి విజేతలుగా ఉన్నారు. స్టోరీ రైటింగ్‌లో ఎస్.హరమ్య, రాజ్‌బైడ్, ఉండ్రు అనూషలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. పోస్టర్ తయారీలో కె.లాజర్ ప్రథమ, సలాది అరుణ ద్వితీయ, అంజూరి గాయత్రీ తృతీయ స్థానాలను అందుకున్నారు. ఫొటోగ్రఫీలో కందుల ప్రవీణ్, మహ్మద్ అబ్దుల్ రహీమ్, నిర్మలరాయ్ మొదటి మూడు స్థానాలను పొందారు. ఉపన్యాసంలో ఈ.వికాస్‌కుమార్, ఎన్.హరమ్య, మహ్మద్ మోనాఆరోజ్‌లు విజేతలుగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణపై జరిగిన వ్యాస రచనలో ముమ్మిడి ఆదిలక్ష్మి ప్రథమ స్థానం, వాసంశెట్టి ఇందిరా ప్రియదర్శిని ద్వితీయ స్థానం, పాక మహి తృతీయ స్థానాన్ని అందుకున్నారు.

మాడవీధుల్లో ఊరేగిన విఘ్నేశ్వరుడు



మాఢ వీధుల్లో ఊరేగుతున్న అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారిని నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు బుధవారం మూషిక వాహనంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ స్వామిని వైభవంగా ఊరేగించారు. స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష గరికపూజ, లక్ష్మీగణపతిహోమం వంటి విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి విశేష పూజలను వీక్షించారు. స్వామికి పంచహారతులు ఇచ్చారు. స్వామిని వివిధ పుష్పాలతో అర్చకస్వాములు అలంకరించారు.

హైవే పక్కన మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం జంక్షన్ వద్ద 16వ నంబరు జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారని రూరల్ ఎస్సై విజయబాబు బుధవారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. తీవ్ర గాయాలతో తెల్లవారుజామున మృతి చెంది ఉంటాడన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు 20 రోజుల నుంచి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ భిక్షాటన చేసుకున్నట్టు తెలిసిందన్నారు. కేసు నమోదు చేశామని, ఆనవాళ్లు గుర్తించేందుకు 72 గంటలు తుని ఏరియా ఆస్పత్రిలో మృతదేహాన్ని భద్రపరుస్తామన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 94407 96573 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

చిట్టీల సొమ్ముతో వ్యాపారి పరారీ

- సుమారు రూ.కోటితో పరారైనట్లు బాధితుల ఫిర్యాదు
- న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన మహిళలు

నిడదవోలు : చిట్టీల పేరుతో ప్రజల నెత్తిన టోపీ పెట్టి, సొమ్ముతో ఓ వ్యాపారి పరారైన ఘటన మండల కేంద్రం ఉండ్రాజవరంలో చోటు చేసుకుంది. గ్రామంలోని ముత్యాలమ్మపేటలో నివాసముంటున్న కె.మోహనరావు 20 ఏళ్లుగా చీటీల వ్యాపారం చేస్తున్నాడు. స్థానికంగా నివాసం ఉండడంతో అతనిని నమ్మిన మహిళలు, స్నేహితులు చిట్టీలు వేయడం, వడ్డీకి డబ్బు ఇవ్వడం వంటివి చేశారు. ఇలా కష్టపడి దాచుకున్న సొమ్ము, బంగారం.. వడ్డీకి ఆశపడి అతనికి ఇచ్చారు. కొంతమంది మహిళలు తమ బంగారు నగలు తాకట్టు పెట్టి మరీ నగదుగా ఇచ్చినట్లు సమాచారం. ఒక్కసారిగా అతను పరారు కావడంతో సుమారు కోటి రూపాయల వరకు మోసపోయినట్లు 30 మంది బాధిత మహిళలు చెబుతున్నారు. తమకు న్యాయం చేయమని పోలీసులను కోరారు. ఈ విషయమై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జూ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం • ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత



హాంగ్జూ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సొనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.



అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగు తాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్ హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్


అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌టెల్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...


• సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది


- నిర్మాత 'బన్నీ' వాసు


• విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ- ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

- శ్రీకాంత్


• 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ- ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


• విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వ విద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ- ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ - ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ- ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.


• అఖిల్
• నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ- ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద. ఓ గొప్ప నటుడు. క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ- ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ- ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ- ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.


• రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ- ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ- ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్, ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.